క్లుప్తంగా

వెల్కమ్ సర్



సర్వేలాండ్ ఏడీతో టీఎన్జీవో నేతలు

కరీంనగర్ అర్బన్: సాధారణ బదిలీల్లో భాగంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను టీఎన్జీవోల సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ ఎల్.ప్రభాకర్, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ నరేందర్, కరీంనగర్‌రూరల్ తహసీల్దార్ సీహెచ్.రాజులను కలిసి బొకే అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, తహసీల్దార్ మడిపల్లి కాళిచరణ్‌గౌడ్, అర్బన్ అధ్యక్షుడు హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్, వెలిచాల సుమంత్‌రావు, నాయకులు మన్మీత్ సింగ్, మోయిజ్, సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, కరుణాకర్, పట్టెం శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రఘు, వాస్తవిక్ గౌడ్, ప్రణీత్, కనకరాజు, డిప్యూటీ తహసీల్దార్లు ఖమ్రుద్దీన్, శంకర్, రాజేశ్వరరావు, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, దర్మారెడ్డి, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన

కరీంనగర్‌క్రైం: ర్యాగింగ్ విషసంస్కృతిని దూరంగా పెట్టాలని త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌర గ్రంథాలయాలపై సెమినార్‌కు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్: హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో ఈనెల 11న పౌర గ్రంథాలయాలపై జరిగే సెమినార్‌కు జిల్లాకు చెందిన తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత గ్రంథాలయాధికారి డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డికి గురువారం రాష్ట్ర ప్రభుత్వ పౌర గ్రంథాలయ పరిషత్ సంచాలకుడు డాక్టర్ రియాజ్ నుంచి ఆహ్వానం అందింది. సుధాకర్‌రెడ్డి పౌర గ్రంథాలయాల ఆధునీకరణ–అభివృద్ధి అంశంపై ప్రసంగించనున్నారు.

తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్.రాజును గురువారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు ఎస్.తిరుపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం.సాయిలు, మండల కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, గంగయ్య, హరీశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌గా ఎంపిక కావడం హర్షణీయం

కరీంనగర్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 27వ చైర్మన్‌గా రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన చల్ల శ్రీనివాసులు శెట్టి నియామకం కావడం హర్షణీయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసులు శెట్టి ఒక మారుమూల గ్రామంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం విద్యనభ్యసించి, ఎస్‌బీఐ చైర్మన్‌గా నియామకం అయ్యే స్థాయికి ఎదగడం గొప్ప పరిణామమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క సన్మానించాలని కోరారు.

వరద బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

కరీంనగర్: కేరళ వరద బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకొని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి అన్నారు. కేరళ వరద బాధితుల సహాయార్థం గురువారం కరీంనగర్ కమర్షియల్ టాక్స్ కార్యాలయ సిబ్బంది వద్ద, ఉమెన్స్ కాలేజీలో విరాళాలు సేకరించారు. వరద బీభత్సంతో అనేక మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని, 400మందిపైగా మరణించినట్లు తెలిపారు. ఇంకా కొంతమంది జాడ తెలియని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను కేరళ సీఎం సహాయ నిధికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, జిల్లా సహాయ కార్యదర్శి లావణ్య, నాయకురాళ్లు రోజా, యమునా, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

జయహో..

- పారిస్ ఒలింపిక్స్‌లో సత్తా చాటిన భారత హాకీ జట్టు
- సాధించిన కాంస్యం
- వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు
- సంబరాల్లో జిల్లా హాకీ క్రీడాకారులు



కరీంనగర్‌స్పోర్ట్స్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నాలుగో పతకం సాధించింది. గురువారం హాకీలో స్పెయిన్‌తో తలపడిన టీం ఇండియా అసాధారణమైన ప్రతిభతో కాంస్యం సొంతం చేసుకుంది. 2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్‌లో విజయం సాధించింది. దీంతో వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు కైవసం చేసుకోవడం విశేషం. జట్టులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, గోల్ కీపర్ శ్రీజేష్‌లు కనబర్చిన ప్రతిభ కాంస్యం వచ్చేలా చేశాయి. భారత్ కాంస్య పతకం సాధించగానే జిల్లాలోని హాకీ క్రీడాకారులు సంబురాల్లో మునిగితేలారు. స్వీట్లు పంచుకొని చక్‌దే ఇండియా అంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులను సాక్షి పలకరించగా తమ మనోభావాలను వెల్లడించారు.

గొప్ప విజయం



పారిస్ ఒలింపిక్స్ హాకీలో పురుషుల జట్టు గొప్ప విజయాన్ని నమోదు చేశారు. 2020లో పతకం సాధించినట్లుగానే మరో మారు పతకం సాధించి యావత్ దేశాన్ని ఆనందంలో ముంచెత్తారు. తృటిలో సెమీస్‌లో ఓటమి చెందాం. అయినా భారత హాకీ సత్తా ఎంటో చూపించింది. – ప్రభుజ్యోత్ సింగ్, జాతీయ హాకీ క్రీడాకారుడు

అద్భుత ప్రదర్శన



ఆది నుంచి అద్భుత ప్రదర్శనతోనే విజయం సాధ్యమైంది. కష్టతరమైన డ్రాలో ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ సెమీస్ చేరి అక్కడ ఓటమి చెంది ఎలాగైన కాంస్యం సాధించాలన్న పట్టుదలతో జట్టుగా పోరాడి విజేతగా నిలిచారు. జయహో భారత్. – మేఘన, జాతీయ హాకీ క్రీడాకారిణి

హాకీకి పూర్వ వైభవం



పురుషుల హాకీ జట్టు 2020, 2024 ఒలింపిక్స్‌లలో పతకాలు సాధించడం సంతోషకరం. ఇండియాకు పూర్వ వైభవం రానుంది. భవిష్యత్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పసిడి పతకమే లక్ష్యంగా బరిలో నిలుస్తారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ ఆట తీరు అద్భుతం. – బి.మురారి, జాతీయ హాకీ క్రీడాకారుడు

చరిత్రలో నిలుస్తారు



ఇండియన్ హాకీం టీం సారథి హర్మన్ ప్రీత్ సింగ్, గోల్ కీపర్ శ్రీజేశ్ అద్భుత ఆట తీరును కనబర్చారు. తిరుగులేని పెనాల్టీ కార్నర్‌లతో మొత్తం 10 గోల్స్ సాధించిన కెప్టెన్, గోల్ పోస్ట్‌లకు అడ్డు గోడగా నిలిచిన శ్రీజేశ్‌లు చరిత్రలో నిలుస్తారు. – కార్తీక్ సంజయ్, జాతీయ హాకీ క్రీడాకారుడు



నగరంలోని 30వ డివిజన్ మారుతినగర్‌లో రోడ్డుపై నల్లాల కోసమని గుంతలు తవ్వి అలానే వదిలేశారు. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఈ గుంతను తిరిగి పూడ్చడం లేదు. వర్షాకాలం కావడంతో నీళ్లు నిండి గుంత కనపడక ద్విచక్రవాహనదారులు అందులో పడిపోతున్నారు. రోడ్డుపైనే ఉన్న ఈ గుంతతో ఈ ప్రాంతవాసులకు ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా నగరపాలకసంస్థ అధికారులు ఈ గుంతను పూడ్చి ప్రమాదాలను తప్పించాలి.

– దనపురి సాగర్, మారుతినగర్

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



బొమ్మకల్‌లో జ్వరాలపై ఇంటింటి సర్వే చేస్తున్న తహసీల్దార్ రాజు, వైద్యసిబ్బంది



11వ డివిజన్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఆకుల నర్మద

కరీంనగర్‌రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని తహసీల్దార్ రాజు సూచించారు. గురువారం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ మండలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన, జ్వర పీడితులను గుర్తింపు సర్వే, నివాసా గృహాల మధ్య నిలిచిన మురుగు నీటిలో దోమల నియంత్రణకు ఆయిల్‌బాల్స్ వేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బొమ్మకల్‌లో గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రాజు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది జ్వరాల బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాల ఆవరణలో స్వశక్తి మహిళలు, పంచాయతీ సిబ్బంది శ్రమదానం ద్వారా గడ్డిని తొలగించి శుభ్రం చేశారు. అనంతరం పచ్చదనం–పరిశుభ్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏవో సత్యం, పంచాయతీ కార్యదర్శులు హిదైతుల్లా, శ్రావణి, ప్రధానోపాధ్యాయురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

కట్టరాంపూర్‌లో..

కరీంనగర్ కార్పొరేషన్: స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా నగరంలోని 11వ డివిజన్ కట్టరాంపూర్‌లో గురువారం ఖాళీ స్థలాల్లో నీళ్లు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు, ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు అందచేశారు. కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న మాట్లాడుతూ స్వచ్ఛదనం–పచ్చదనంలో డివిజన్ ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. 11వ డివిజన్ ఇన్‌చార్జి రంజిత్ కుమార్, ఆర్పీలు మంజుల, లత, ఏఎన్ఎం సంపూర్ణ, మున్సిపల్ జవాన్ నాగరాజు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కరీంనగర్: దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని తెలంగాణచౌక్‌లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. సామాజిక అభివృద్ధికి, దళిత సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఏటా తగిన బడ్జెట్‌ను కేటాయించడం లేదని విమర్శించారు. నీతి అయోగ్ సిఫార్సుల ప్రకారం దళితుల జనాభా ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు రావాల్సిన కేటాయింపులు రావడం లేదని మండిపడ్డారు. దళితులపై అఘాయిత్యాలు జరగకుండా నిరోధించడానికి ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయిా కంటి శ్రీనివాస్, సుంకరి సంపత్, కేవీపీఎస్ నగర కార్యదర్శి గాజుల కనకరాజు నాయకులు రాజు, ప్రభాకర్, శ్రీకాంత్, గద్దర్ అభిమాన సంఘం రాష్ట్ర నాయకులు మొగురం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ఆర్‌డీసీ సెలక్షన్స్‌లో ప్రతిభ



రోహిత్‌కుమార్‌ను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న వి.రోహిత్‌కుమార్ ఎన్‌సీసీ 9 బెటాలియన్ వారు ఎస్సారార్ కళాశాలలో నిర్వహించిన ప్రి ఆర్‌డీసీలో ఎంపికయ్యాడు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఢిల్లీలో జరగబోయే ఎన్‌సీసీ పరేడ్‌కి ఎంపిక అవుతాడని చైర్మన్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. రోహిత్‌కుమార్‌ను చైర్మన్ ఫాతిమారెడ్డి, ఎన్‌సీసీ బృందం, ఎన్‌సీసీ కేర్ టేకర్ రజిత అభినందించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్, మహిళా సంక్షేమ శాఖల అధికారులు

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్‌యాదవ్ కోరారు. గురువారం బొమ్మకల్ బైపాస్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాల, కోతిరాంపూర్ సవరన్ ప్రభుత్వ పాఠశాలలో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సినిమాలు, స్నేహితుల ప్రభావంతో విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నపుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాతో కాలక్షేపం చేస్తు విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సరైన అవగాహన లేకపోవడంతో మోసపోతున్నట్లు తెలిపారు. మంచి పుస్తకాలను చదువుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాలపై కలిగే దుష్పరిణామాలపై ముద్రించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్, భూమయ్య, శ్రీలత, ప్రిన్సిపాల్స్ అంజలి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కరీంనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ స్కూల్ ఆధ్వర్యంలో 2024–25 విద్యాసంవత్సరానికి నిర్వహిస్తున్న ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ ప్రవేశాల కోసం సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజును అందుబాటులో ఉన్న ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి ఆన్‌లైన్‌లో చెల్లించి ప్రవేశాలు పొందవచ్చనని అన్నారు. ఎస్ఎస్‌సీ అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.1550, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.1150, ఇంటర్‌కు ఓసీలకు రూ.1800, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు రూ.1500లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చలువాజు నాగేశ్వర్‌రావు 8309212661ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మాట్లాడుతున్న నాయకులు

కొత్తపల్లి: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, లేకుంటే పేదలతో ఆక్రమిస్తామని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. గురువారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పద్మనగర్, చింతకుంట శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించారు. 7 బ్లాకుల్లో 90శాతం పూర్తయిన 666 ఇళ్లు చిన్న చిన్న కారణాల వల్ల పేదలకు కేటాయించలేక పోయారని అన్నారు. కొన్ని ఇళ్లు నిర్మించి వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా డబుల్ బెడ్రూం ఇళ్లపై దృష్టి పెట్టి పనులు పూర్తి చేసి కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిప్పారపు సురేశ్, గజ్జల శ్రీకాంత్, నగర కమిటీ సభ్యులు పున్నం రవి, పుల్లెల మల్లయ్య, తిరుపతి, నాయకులు డబిల్‌కర్ శ్రీకాంత్, రత్నం సురేశ్, కొయ్యడ అనిల్, సన్నీ, రాముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు మూడో దఫా దరఖాస్తుల స్వీకరణ

విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు మూడో దఫా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా రూ.100 చెల్లించి వెబ్‌సైట్‌లో ఈనెల12లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేయాలి



మాట్లాడుతున్న నతానియేలు

విద్యానగర్(కరీంనగర్): సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని మాదిగ మేధావుల ఫోరం జనరల్ సెక్రెటరీ, ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ నతానియేలు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు స్పందించి మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పటాన్ని అభినందిస్తునట్లు తెలిపారు. జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్సు తెచ్చి అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో బంధు సొసైటీ, హైదరాబాద్ అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి, మాదిగ మేధావుల ఫోరం బాధ్యులు శ్రీనివాస్, నాగరాజు, శంకర్, ఈశ్వర్, కొమురయ్య, కుమారస్వామి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కరీంనగర్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర బీజేపీ ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. గురువారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల ముకుందలాల్ మిశ్రాభవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిన అశోక్ అధ్యక్షతన జరిగిన కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ మూడోసారి అధికారంలో చేపట్టిన తర్వాత మరింతగా ఉత్సాహంతో పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలకు నేషనల్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుందన్నారు. అలాగే ఈనెల 14న జనజాగరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వాసుదేవారెడ్డి, జిందం ప్రసాద్, ఆగయ్య, వడ్ల రాజు, శ్రీనివాస్, గుడికందుల సత్యం, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత ఉత్తర్వులు అందజేత



దంపతులకు ఉత్తర్వుల కాపీలు, పాపను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: కరీంనగర్ శిశుగృహ నుంచి ఐదు నెలల పాపను దత్తత తీసుకున్న బెంగుళూరుకు చెందిన దంపతులకు కలెక్టర్ పమేలా సత్పతి గురువారం దత్తత ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీకుల నుంచి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, పీవో తిరుపతి పాల్గొన్నారు.

నమూనా ఎన్నికలు



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఉన్న విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ లీన ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోండి

కరీంనగర్: రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేట గ్రామంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అన్నపాక గంగోత్రి తల్లి నిర్మలతో కలిసి గురువారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలల్లో చదివిన తమకు పై చదువుల కోసం సర్టిఫికెట్లతో పాటు టీసీ ఇవ్వాలని కోరితే రెండు పాఠశాలలు ఒకరిపై ఒకరు చెబుతూ నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచారం

నేడు లక్ష్మీగణపతిస్వామి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి క్షేత్రంలో శుక్రవారం లక్ష్మీగణపతి ఆలయ 26వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. స్వామివారికి 108 కలశాలతో అభిషేకం, మోదక హవనం జరుపనున్నారు. అలాగే ఔదుంబరేశ్వరస్వామికి విశేష అభిషేకం జరుగనుంది. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

నియామకం

ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా స్వప్న



సప్తగిరికాలనీ(కరీంనగర్): ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కరీంనగర్‌కు చెందిన మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్నను నియమిస్తూ గురువారం జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాసు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివనాథుని శ్రీనివాస్, జిల్లా కిరాణా వర్తకం సంఘ అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యానగర్(కరీంనగర్): అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ ఈ–శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు చనిపోయిన, శాశ్వత అంగవైకల్యం పొందిన కార్మికులు, వారి నామినీలు ఎక్స్‌గ్రేషియా కోసం ఈనెల 27లోగా పూర్తి ఆధారాలతో కరీంనగర్ పొన్నం కాంప్లెక్స్‌లోని ఉప కార్మిక కమీషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉప కార్మికశాఖ కమిషనర్ శామ్యూల్ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతీ విద్యార్థి ఇన్నోవేటర్‌గా మారాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కో ఆర్డినేటర్ మణిదీప్

కరీంనగర్‌సిటీ: నూతన పద్ధతుల ద్వారా తమ చుట్టూ ఉన్న సమస్యల పరిష్కారం కనుక్కొనేందుకు ప్రతీ విద్యార్థి ఇన్నోవేటర్‌గా మారాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ యాంసాని సత్యనారాయణ అన్నారు. గురువారం కళాశాలలో జిల్లాస్థాయి ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఇన్నోవేషన్ సెల్ కో ఆర్డినేటర్ మణిదీప్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇన్నోవేషన్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటికో ఇన్నోవేషన్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. అధ్యాపకులు రాజయ్య, శ్రీనివాస్, తిరుపతి, మల్లారెడ్డి, సుధాకర్, రాజేందర్, రామకృష్ణ, అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు బాధ్యత వహించాలి

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో దళితులపై దాడులకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షాద్‌నగర్ ఘటనకు సంబంధించి దళిత మహిళ సునీతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐ రాంరెడ్డిని సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాంరెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు. బాధితురాలికి రూ.25లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, నాయకులు నల్లాల శ్రీనివాస్, మంద మల్లయ్య, కల్లెపల్లి రాజేందర్, అక్కి బాలకిషన్, మంకాలి తిరుపతి. కుమ్మరి సంపత్. మహేందర్ పాల్గొన్నారు.